మిగిలిన ధాన్యాన్ని 15లోపు విక్రయించాలి

జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి

ఏలూరు: ఇప్పటివరకూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించి దాదాపుగా 90 రోజులైందని, రోజు వారీ కొనుగోళ్లు తగ్గాయని, రైతులు మిగిలిన ధాన్యాన్ని ఈనెల 15వ తేదీ లోపు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఏదైనా మండలాల్లో రైతులు అపరాలు సాగు చేస్తున్న కారణంగా వరి కుప్పలు నూర్పిళ్లు చేయడం ఆలస్యమవుతుందో మిగులు ధాన్యాన్ని రబీ సీజన్‌లో లేట్ ఖరీఫ్ కింద కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఆలస్యంగా నూర్పిళ్లు చేసుకునే ధాన్యాన్ని విక్రయించడానికి ఆందోళన చెందొద్దని తెలిపారు. ఈ నెల 7వ తేదీ నాటికి 41,570 మంది రైతుల నుంచి 712.17 కోట్ల రూపాయల విలువైన 3,26,005 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రైతుల నుంచి సేకరించామన్నారు.

వెంటాడి.. వేటాడి..!

చిరుద్యోగులైన ఆశా వర్కర్లపై ప్రభుత్వం దమనకాండ సాగించింది. నేరస్తులను వెంటాడినట్లు వెంటాడి మరీ అరెస్టులు చేసింది. ఇంటి నుంచి కాలు కదిపితే నేరమన్నట్లు నిర్బంధకాండకు దిగింది. దీంతో జిల్లాలోని పోలీస్‌స్టేషన్లన్నీ అరెస్టయిన ఆశా వర్కర్లతో నిండిపోయాయి. బస్సుల్లో, రైళ్లలో ఇతర వాహనాల్లో వెళ్తున్న వారిని ఎక్కడికక్కడే దించి రోడ్లపైనే తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. సిఐటియు, సిపిఎం నాయకులను సైతం అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించి నిరంకుశధోరణితో ముందుకు సాగింది. తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలంటూ గురువారం విజయవాడలో చేపట్టిన మహాధర్నాకు వెళ్తున్న ఆశాలపై ప్రభుత్వం సాగించిన నిరంకుశ ధోరణిపై విమర్శలు వెల్లువెత్తాయి.

శ్రామిక జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మిని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

- ఆశా వర్కర్లపై ప్రభుత్వ దమనకాండ
- విజయవాడలో మహాధర్నాకు వెళ్లనివ్వకుండా తీవ్ర నిర్బంధం
- బస్సులు, రైళ్లు, వాహనాల్లో వెళ్తున్న వారిని వెంటాడి అరెస్టులు
- వేల మంది ఆశాల అరెస్టులతో తీవ్ర ఉద్రిక్తత
- సిఐటియు, సిపిఎం నాయకులపైనా తీవ్ర నిర్బంధం, అరెస్టులు
- జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లూ అరెస్టుచేసిన 'ఆశ'లతో కిటకిట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కనీస వేతనం అమలుచేయాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లు ఇవ్వాలని, రూ.ఐదు లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సంక్షేమ పథకాలు అందించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం అమలు చేయాలని, చనిపోయిన ఆశా ఉద్యోగి ఇంట్లో ఒకరి ఉద్యోగం ఇవ్వాలంటూ తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలంటూ ఆశా వర్కర్లు చేపట్టిన విజయవాడలోని మహాధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వం దుర్మార్గంగా ముందుకు సాగింది. వెంటాడి.. వేటాడి అన్నట్లు ఆశావర్కర్లపై తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. బుధవారం సాయంత్రం నుంచి విజయవాడలోని మహాధర్నాకు వెళ్లకుండా ఆశావర్కర్లకు, సిఐటియు నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం నిర్బంధం కొనసాగించింది. ఏలూరు జిల్లా సిఐటియు అధ్యక్షులు ఆర్.లింగరాజును భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు, జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ బుధవారం సాయంత్రం నుంచి సిఐటియు కార్యాలయంలో నిర్బంధించి పోలీసులు కాపలా కాసిన పరిస్థితి కొనసాగించింది. సిఐటియు నాయకులు సోమయ్య, జన్నాథరావును, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కిషోర్‌ను అరెస్టుచేసి ఏలూరు టుటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. తెల్లవారు జాము నుంచి పోలీసులు బస్సులు, రైళ్లు, వాహనాలను తనిఖీ చేస్తూ జనాలు భయాందోళనకు గురిచేసే విధంగా వ్యవహరించారు. ఆశావర్కర్లను జల్లెడపడుతూ వెంటాడిన పరిస్థితి నెలకొంది. వాహనాల్లో వెళ్తున్నవారిని ఎక్కడికక్కడే దించేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లు అరెస్టయిన ఆశా వర్కర్లతో కిక్కిరిసి పోయాయి. అరెస్టులకు నిరసనగా పోలీస్‌స్టేషన్ల వద్దే ఆశాలు ఆందోళనలు చేపట్టారు. దీంతో పోలీస్‌స్టేషన్లు ఆశా వర్కర్ల నినాదాలతో మార్మోగాయి. అరెస్టు చేసిన ఆశాలను విడుదల చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో మరికొంతమంది ఆశాలు పోలీస్‌స్టేషన్ల ముందు ఆందోళనలు కొనసాగించిన పరిస్థితి నెలకొంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరడం నేరమన్నట్లు ప్రభుత్వం తమను నిర్బంధించడం దారుణమంటూ ఆశాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన ఆశా వర్కర్లను విడుదల చేయాలంటూ ఏలూరులోని సిఐటియు కార్యాలయం నుంచి టుటౌన్ పోలీస్‌స్టేషన్ వరకూ శ్రామిక జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ప్రదర్శన నిర్వహించి స్టేషన్ ఎదుట బైఠాయించారు. దీంతో పోలీసులు బలవంతంగా విజయలక్ష్మిని, సిఐటియు నాయకులు గోపీని అరెస్టు చేసి స్టేషన్‌లోకి తరలించారు. పశ్చిమగోదావరి జిల్లాతోపాటు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి వంటి ఇతర జిల్లాలకు చెందిన ఆశా వర్కర్లను బస్సుల్లో నుంచి దించేసి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు, కళ్యాణ మండపాలకు తరలించారు. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ఆశాలను విజయవాడలో అరెస్టు చేసి కలిదిండిలోని కళ్యాణి ఫంక్షన్ హాల్లో నిర్బంధించారు. విజయవాడకు బస్సులో వెళ్తున్న ఆశా వర్కర్లను ఏలూరులోని కలపర్రు టోల్‌గేట్ వద్ద దించేసి పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఆశాలు అక్కడే కూర్చొని ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి నిర్బంధం ప్రయోగించినా ఆశావర్కర్లు ఏమాత్రమూ బెదరని పరిస్థితి కనిపించింది. అరెస్టయిన ఆశావర్కర్లతోపాటు, సిఐటియు నాయకులు మాట్లాడుతూ పెరిగిన ధరలతో రూ.పది వేల వేతనం ఏవిధంగా సరిపోతుందని, కనీస వేతనంతోపాటు, తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయమని అడిగితే ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం ఏవిధంగా సమంజసమంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదంటూ హెచ్చరించారు.

ఏలూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

కలపర్రు టోల్‌గేట్ వద్ద ఆశాల నిర్బంధం

బిజెపికి వైసిపి, టిడిపి దాసోహం..!

- అరకొర డిఎస్‌సితో నిరుద్యోగులకు అన్యాయం
- ప్రత్యేక హోదాపై రెండు పార్టీలు ప్రజలకు మోసం
- దెందులూరులో బస్సుయాత్రలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు బిజెపి పెద్దల వద్దకెళ్లి కాళ్లు మొక్కారని, రేపు జగన్ కూడా బిజెపి పెద్దల వద్దకెళ్లడానికి సిద్ధమవుతున్నారని, రెండు పార్టీలూ రాష్ట్రానికి అన్యాయం చేసి బిజెపి దాసోహం అంటున్నాయనంటూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. బిజెపి ఒక్క సీటు కూడా గెలవకుండా రెండు పార్టీలనూ తమ గుప్పెట్లో పెట్టుకుందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో గురువారం కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల బస్సు యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర జాతీయ రహదారి నుంచి దోసపాడు మీదుగా పోతునూరు వరకూ కొనసాగింది. ముందుగా దెందులూరు నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారికి షర్మిల చేరుకోగానే దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డివిఆర్‌కె చౌదరి, జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగత పలికారు. రోడ్డు పొడవునా పూలుజల్లుతూ జనం నుంచి మంచి స్పందన రావడంతో కాంగ్రెస్ నాయకుల్లో జోష్ నెలకొంది. ఈ సందర్భంగా షర్మిలా మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి ఏంచేసిందంటూ ప్రశ్నించారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను అమలు చేయలేని దిక్కు మాలిన ప్రభుత్వంగా వైసిపి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం విషయంలో వైసిపి, టిడిపిలు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేశాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాపై మొదటి సంతకం చేస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ప్రధాన దృష్టిపెడతామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో మెగా డిఎస్‌సి నిర్వహిస్తామని జగన్ ప్రకటించారని, ఐదేళ్లు నోరుమెదపని జగన్ ఎన్నికల వేళ ఆరు వేల పోస్టులతో ప్రకటన ఇచ్చి తుస్సు మనిపించారన్నారు. ఇదో ఎన్నికల డ్రామా అన్నారు.

పోలవరం పూర్తి చేయలేదు..

పోలవరం ప్రాజెక్ట్‌పై టిడిపి ఎంతో హడావుడీ చేసిందని, తర్వాత జగన్ 2021 నాటికి పూర్తి చేస్తానని డాంబికాలు పలికారన్నారు. 2021 నాటికి ప్రాజెక్ట్ వ్యయం రూ.55 వేల కోట్లకు పెరిగిందని లెక్కలు కట్టారన్నారు. జగన్ ఐదేళ్ల కాలంలో రూ.ఎనిమిది లక్షల కోట్లు అప్పుచేశారని, అందులో నుంచి కనీసం రూ.50 వేల కోట్లు పోలవరం కోసం వెచ్చించలేక పోయారని విమర్శించారు. ప్రత్యేక హోదా వల్ల ఉద్యోగాలు, పరిశ్రమలు వస్తాయని చెప్పి గాలికి వదిలేశారన్నారు. తనకున్న 21 మంది ఎంఎల్‌ఎలతో రాజీనామా చేయిస్తానని ప్రగల్భాలు పలికాడని చెప్పారు. అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తడం లేదన్నారు. 30 వేల మంది స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు తమ ఉద్యోగాలు పోతాయని ఎందుకు ఆందోళన చేస్తున్నారో తెలపాలన్నారు. రాష్ట్రంలో అసలు రాజధాని ఉందా అని ప్రశ్నించారు. 70 రోజులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశ్రమించవద్దని, ప్రతి ఓటరునూ కలిసి ప్రభుత్వ, ప్రతిపక్షాల వైఫల్యాలను వివరిద్దామన్నారు. కాంగ్రెస్ వస్తే ఏం జరుగుతుందో వివరించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేద్దామన్నారు. మాజీ కేంద్ర మంత్రులు, సిడబ్ల్యూసి సభ్యులు జెడి శీలం, గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, దంపుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు షర్మిల

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఏలూరు అర్బన్: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని యూనియన్ నాయకులు జె.శ్రీనివాసరావు, డిఎన్‌విడి ప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, డైరెక్ట్ పేమెంట్ విధానం అమలు చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్లను సంస్థలో విలీనం చేయాలని కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం ఎపి ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లను తక్షణమే సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విధి నిర్వహణలో అత్యధిక మంది ప్రాణాల కోల్పోయేది విద్యుత్ సంస్థల్లో మాత్రమేనని, ఇన్ని త్యాగాలు చేస్తున్న విద్యుత్ కార్మికుల పట్ల ముఖ్యమంత్రి చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. విద్యుత్ మీటర్ రీడర్లు, స్టోర్స్ హమాలీలకు కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాముడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చాట్రాయిలో..

భీమడోలులో..

కొయ్యలగూడెంలో..

కలిదిండిలో..

మండవల్లిలో..

ఆశాలపై ఉక్కుపాదం..

అరెస్టులు, నిర్బంధాలను నిరసిస్తూ పోలీసు స్టేషన్ల వద్ద ఆందోళనలు

తమ సమస్యల పరిష్కారం కోరతూ చలో విజయవాడ ధర్నాకు వెళుతున్న ఆశాలను పోలీసులు నిర్బంధించారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేసి స్టేషన్‌లకు తరలించారు. ఆశాల అరెస్టులను సిఐటియు, సిపిఎం నాయకుల ఖండిస్తూ సంఘీభావం తెలిపారు.

ప్రజాశక్తి - భీమడోలు

సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ ధర్నాకు వెళుతున్న ఆశా కార్యకర్తలపై పోలీసుల నిర్బంధం కొనసాగింది. గురువారం విజయవాడలో నిర్వహించే ధర్నాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆశా కార్యకర్తల కోసం పోలీసులు రాత్రి నుంచి వెతకడం ప్రారంభించారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల మండలాల్లో ఆశా కార్యకర్తలపై నిర్బంధం కొనసాగిందన్నారు. మండలంలోని గుండుగొలను, పూళ్లతో పాటు భీమడోలు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల నుంచి విజయవాడ వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సుమారు 50 మంది ఆశా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తరలించారు. ఆశా కార్యకర్తలు అక్కడే తమ ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగించారు. వీరికి సంఘీభావం తెలిపేందుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగరాజు చేరుకొని ప్రసంగించారు. ఆశాలు చేపట్టిన ఆందోళనకు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.వీర్రాజు, సిపిఎం నాయకులు పాలికొండ నాగరాజు, గుర్రాల పాపారావు మద్దతు తెలిపారు.

ఏలూరులో అర్బన్ : జిల్లాలో పోలీసుల దౌర్జన్యాలు, దమన కాండను నిరసిస్తూ ఆశ వర్కర్లు ఏలూరు సిఐటియు కార్యాలయం నుంచి ప్రదర్శనగా టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అరెస్టు చేసిన ఆశావర్కర్లను విడుదల చేయాలని బైఠాయించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. సిఐటియు నాయకులు జి.గోపి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మిలను పోలీసులు మోసుకుని స్టేషన్‌లో పడేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించమంటే జగన్ ప్రభుత్వం దుర్మార్గంగా ఆశలను అరెస్టులు చేస్తుందని విమర్శించారు. జిల్లాలో ఒక మహిళా ఎస్‌పి ఉండి మహిళలపై దౌర్జన్యకాండ పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చాట్రాయి: తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ ధర్నాకు వెళుతున్న ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయటం మంచి పద్ధతి కాదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చాట్రాయి, చింతలపూడి మండలాల ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించడం జరిగిందని, అరెస్టు చేసిన ఆశాలను విడుదల చేయాలని ఆనందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల యూనియన్ మండల నాయకులు సింగనపల్లి పుల్లమ్మ, యురేనికా, చింతలపూడి ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు జె.పుష్ప రాణి, బి.అనసూర్యలతో పాటు రెండు మండలాల ఆశా కార్యకర్తలు 40 మందిని అరెస్టు చేసి ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్నారని తెలిపారు.

కొయ్యలగూడెం : ఆశా వర్కర్లు దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి విజయవాడలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని వెళ్లేందుకు సిద్ధమైన ఆశాలపై పోలీసుల నిర్బంధం కొనసాగింది. గృహ నిర్బంధం, నోటీసులు ఇవ్వడం, టోల్ గేట్, ఇతర బస్ స్టాప్‌లలో పోలీసులు బస్సు లోపలికి ప్రవేశించి చెక్ చేయడం వంటి చర్యలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు ఖండించారు. పోలీసుల నిర్బంధంలో ఆశా వర్కర్లు కొయ్యలగూడెం యూనియన్ ప్రెసిడెంట్ డి.లక్ష్మి తులసి, వైస్ ప్రెసిడెంట్ వి.అరుణ, సుజాతా, ఎస్.రత్నం, పి.శిరీష, బి.రాణి, బి.కుమారి, పి.నీలవేణి, బి.స్వరూప రాణి, రాణి, ఎస్.రత్నం ఉన్నారు.

నిడమర్రు : చలో విజయవాడ ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్స్‌ను అడ్డుకుని చేబ్రోలు, తాడేపల్లిగూడెం, నిడమర్రు పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు ఖండించారు. రమణారావు మాట్లాడుతూ అక్రమ అరెస్టుల ద్వారా పోరాటాలు, ఉద్యమాలని అణిచివేయాలని చూసిన అనేక ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రభుత్వానికి కార్మికులే గోరీ కడతారన్నారు. అరెస్టైన ఆశ యూనియన్ అధ్యక్షులు పిల్లహరి కుమారి, అల్లు సత్యవతి, కె.సుబ్బలక్ష్మి, జి.రమణను విడుదల చేయాలని తెలిపారు.

నూజివీడు రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని విజయవాడ మహాధర్నాకు బయలుదేరిన ఆశా వర్కర్లను గురువారం నూజివీడు పోలీసులు అడ్డుకున్నారు. నూజివీడు పరిసర ప్రాంతాల్లోని ఆశాలను అడ్డుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో ఆశాలు తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

కలిదిండి : తమ సమస్యల పరిష్కారానికై ఆశా వర్కర్లు విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు వెళ్లకుండా నెల్లూరు, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన వారిని అక్రమంగా అరెస్ట్ చేసి సుమారు 100 మందికి పైగా ఆశాలను స్థానిక కళ్యాణి ఫంక్షన్ హాల్‌కు తరలించారు. వారికి మండల సిపిఎం నాయకులు వీరవల్లి భాస్కరరావు, దొంగ వెంకట సత్యన్నారాయణ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ, సంఘీబావం తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావును అరెస్ట్ చేసి స్టేషన్‌లో నిర్బంధించారు.

ఆగిరిపల్లి: తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ మహాధర్నాకు తరలి వెళుతున్న మండల ఆశా కార్యకర్తలను ఆగిరిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు నీలాంబరం, అమృత, సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి: ఆశా వర్కర్లను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని విజయనగరం జిల్లా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సుధారాణి హెచ్చరించారు. ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేయడానికి వెళుతున్న ఆశ వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి మండవల్లి కల్యాణ మండపానికి గురువారం తరలించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నువ్వు పాదయాత్ర చేయలేదా.. ధర్నాలు చేయలేదా.. జగన్ నీకు ఒక న్యాయం, మాకొక న్యాయమా అంటూ మండిపడ్డారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఆమె కోరారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతామని ఆమె హెచ్చరించారు.

ముసునూరులో..

ముసునూరు : ఆశా వర్కర్లు గురువారం చలో విజయవాడలో జరిగే కార్యక్రమానికి హాజరుకాకుండా ఉండేందుకుగాను ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ముసునూరు మండలంలోని 16 గ్రామాల ఆశాలను కొందరిని ముసునూరు పోలీస్ స్టేషన్ వద్ద, మరికొందరిని నూజివీడు సారథి కళాశాల వద్ద నిర్బంధించారు. వైసిపి ప్రజా వ్యతిరేక పరిపాలనకు అడ్డం పడుతున్నట్లు సిఐటియు నాయకులు జి.రాజు తెలియజేశారు.

ముదినేపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లే ఆశ వర్కర్లను పోలీసులు నిర్బంధించారు. ముదినేపల్లి మండలంలో ఆశ వర్కర్లను విజయవాడ వెళ్లకుండా పోలీసులు బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. బస్సులో వెళుతున్న ఆశాలను కిందికి దింపేశారు. అలాగే విజయవాడలో ధర్నాలో పాల్గొనేందుకు వచ్చిన ఆశ వర్కర్లను ఆర్‌టిసి బస్సులో ముదినేపల్లి తరలించి, స్థానిక విఆర్ కళాశాల ప్రాంగణంలో నిర్బంధించి, సాయంత్రం విడుదల చేశారు.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో చేపట్టిన మహాధర్నాను విఫలం చేసేందుకు జిల్లావ్యాప్తంగా పోలీసులు బరితెగించారు. మహిళలైన ఆశ వర్కర్లను అత్యంత దుర్మార్గంగా పోలీస్ స్టేషన్లలో నిర్బందించడం, ఇళ్ల వద్ద పోలీసులు నిఘా పెట్టి వారిని ఇబ్బందులకు గురి చేయడం, విజయవాడ వెళ్తున్న వారిని బస్సుల్లో నుంచి దింపి అరెస్టు చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ఆందోళనపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. అయినప్పటికీ ఆశా వర్కర్లు వందల సంఖ్యలో తమ నిరసన తెలియజేసేందుకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద వందల సంఖ్యలో ఆశా వర్కర్లను అరెస్టులు చేసి నిర్బంధించారు. దీంతో సుమారు 200 మంది ఆశా వర్కర్లు టోల్‌గేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

నిర్బంధాలు దారుణం...

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సిపిఎం నాయకులు ఎ.రవి, సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కి తరలించే చర్యలకు పాల్పడ్డారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ ఆశాలు అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

చింతలపూడి : రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లపై అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికై రాష్ట్రవ్యాప్తంగా ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు పిలుపు మేరకు మహాధర్నా కార్యక్రమానికి వెళుతున్న చింతలపూడి, టి.నర్సాపురం మండల ఆశా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని చింతలపూడి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న చింతలపూడి మండలం సిఐటియు, సిపిఎం, అంగన్వాడీ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఆశా కార్యకర్తల డిమాండ్లకు మద్దతుగా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లకు సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మండల ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సరళ, టి.నర్సాపురం నాయకులు వనిత ధర్నా కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

ఏలూరు టూ టౌన్ స్టేషన్‌లో సిపిఎం నాయకులు

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

ఎంపిడిఒ కె.కిరణ్ కుమార్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని నూజివీడు పట్టణంలోని మండల ఉపాధి హామీ కేంద్రంలో ఎంపిడిఒ కె.కిరణ్ కుమార్ ఆదేశించారు. ఈమేరకు గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గృహాలు నిర్మించుకున్న ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి కట్టుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పనులు, కూలీల హాజరు వివరాలను ఎపిఒ సోమేశ్వర వివరించారు.

డీలర్ గౌతమ్ కుమార్‌పై కేసు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలనులోని రేషన్ షాపులపై నిర్వహించిన దాడుల్లో బియ్యం నిల్వల తేడాలు గుర్తించినట్లు పౌరసరఫరాల సంస్థ భీమడోలు డిప్యూటీ తహశీల్దార్ ఎ.మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గుండుగొలనులోని రేషన్ షాపుల్లో బియ్యం నిల్వల్లో తేడా ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు బుధవారం రాత్రి గ్రామ రెవెన్యూ అధికారి గోవింద్ సహకారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.గౌతమ్ కుమార్ పేర నిర్వహిస్తున్న రేషన్ షాప్‌లో 250 కేజీల మేరకు బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. డీలర్‌పై నిత్యావసర వస్తువుల చట్టం కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

వైష్ణవికి కామధేను అవార్డు

ముదినేపల్లి: తెలంగాణ రాష్ట్రానికి చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ కుమార్త, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి కామధేను అవార్డు అందుకోనున్నట్లు ఆమె తండ్రి మనోజ్ గురువారం తెలిపారు. వైష్ణవి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డుకు ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారిగా ఈ అవార్డుకు వైష్ణవి ఎంపిక కావడం విశేషం. వైష్ణవి ఎంపిక కావడం పట్ల పలువురు డాక్టర్లు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయానికి శూన్యం

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి శూన్యం చూపించిన మొట్ట మొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రాయ్యంకుల లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ బడ్జెట్‌లో గతంతో పోల్చుకుంటే ఎన్నడు లేని విధంగా వ్యవసాయ రంగానికి అతి తక్కువ నిధులు కేటాయించడం, ఉద్యానవన పంటలకు సబ్సిడీలు ఎత్తి వేయడం చాలా విచారకరమన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం నేటి వరకు ఇవ్వలేదన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని గుడిపాడు, లోపూడి, ఎల్లాపురం, గోపవరం, బలివే, ముసునూరు గ్రామాల్లోని ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఎసిఐ పి.వాసు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు నూజివీడు డివిజన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు రెవిన్యూ అధికారి ఏమిలేకుమారి తెలిపారు. కావున మండలంలోని 16 గ్రామాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేయడం తప్పనిసరి అన్నారు. వీరితో పాటు ఇఒపిఆర్‌డి ఎస్ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, విఆర్ఒ మస్తాన్‌రావు ఉన్నారు.

తహశీల్దారుగా శర్మ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు తహశీల్దారుగా ఎవి.శర్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా బాధ్యతలు చేపట్టి, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్నికల నిర్వహణకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ బూత్ వద్ద కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

పీజీ సెంటర్‌లో ఫ్రెషర్స్ డే

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో గురువారం ఫస్ట్ ఇయర్ ఎంబిఎ విద్యార్థులు ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సినీగేయాలకు నృత్యాలు చేశారు. విద్యార్థులు ప్రొఫెసర్ ఎంవి.బసవేశ్వర రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రాజారత్నం, ప్రభాకర్ రావు, నాగేశ్వరరావు, తిరుమల రావు, ఎస్‌కె.అన్వర్ భాష, తదితర ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యుత్ నూతన సర్వీసులు సచివాలయాల్లోనే

ప్రజాశక్తి - భీమడోలు

వ్యవసాయ, ఇతర విద్యుత్ నూతన సర్వీస్‌ల కోసం ఇకపై గ్రామ సచివాలయాల ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలని, విద్యుత్ శాఖ ఏలూరు ఇఇ నటరాజన్ సూచించారు. భీమడోలు ట్రాన్స్ కో సెక్షన్ కార్యాలయంలో ఎఇ రామస్వామి అధ్యక్షతన వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు గురువారం సాయంత్రం ట్రాన్స్ కో, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యుత్ శాఖ ఇఇ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, ఇతర విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తుదారులు తమ పేర్లను గ్రామ సచివాలయాల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఎస్టిమేట్ చార్జీల మినహా ఏ విధమైన ఇతర చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ, భీమడోలు వ్యవసాయ అధికారి ఎస్‌పివి.ఉషారాణి పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

భీమడోలు: ఆటో డ్రైవర్లు రహదారి భద్రత నియమాలను పాటించాలని, వ్యక్తిగత రక్షణతో పాటు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి కోరారు. భీమడోలు శ్రీవెంకటేశ్వర ఆటో యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు బాదర్వాడ కృష్ణమోహన్ రాజు ఆహ్వానం మేరకు గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు కార్యాలయానికి భవనం లేక ఆటో యూనియన్ సభ్యులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన సీతారామాంజనేయ చౌదరి ఆటో యూనియన్ భవన నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులతో పాటు ఆటో యూనియన్ అధ్యక్షులు సీరా సాంబశివరావు, ఇతర కార్యవర్గ సభ్యులు స్వీకరించారు. భవన నిర్మాణానికి విరాళాన్ని ఇచ్చిన సీతారామ చౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి

చింతలపూడి : ఎంపీ అభ్యర్థిగా గారపాటి చౌదరిని గెలిపించాలని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. జబర్దస్త్ టీమ్, సినీ గాయకులతో కూడిన బృందం గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి సందడి చేసింది. మండలంలోని ఎర్రగుంటపల్లి, రాఘవపురం, ప్రగడవరం, చింతలపూడి పట్టణ పరిధిలో పర్యటించి ప్రధాని మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట వేంకట నారాయణ, నియోజకవర్గ కన్వీనర్ ఏసుబాబు, మండల అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కార్మికుడి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామంలో ఉన్న ప్రయివేట్ సీడ్ కంపెనీలో గురువారం అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. థాయిలాండ్‌కు చెందిన వాల్విత్(45) కంపెనీలోని మూడంతస్తుల పైభాగము నుంచి పడి మృతి చెందినట్లు స్థానికులు తెలియజేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మానవత సేవలు వినియోగించుకోవాలి

సంస్థ జిల్లా కన్వీనర్ గంగాధర రావు, కెరీర్ గైడెన్స్ విభాగం జిల్లా డైరెక్టర్ వెంకట ఉమామహేశ్వర రావు

ప్రజాశక్తి - భీమడోలు

పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వివిధ రూపాల్లో సహాయం అందించేందుకు ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థ మానవత సేవలు వినియోగించుకోవాలని సంస్థ జిల్లా కన్వీనర్ రామిశెట్టి గంగాధర రావు, కెరీర్ గైడెన్స్ విభాగం జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వర రావు కోరారు. గురువారం మండలంలోని ఆగడాల లంక, గుండుగొలను హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉమామహేశ్వరరావు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నతస్థాయి భవిష్యత్ కోసం నిర్ణయించుకోవాల్సిన లక్ష్యాలు, వాటి సాధనకు చేయాల్సిన కృషి, ఇతర అంశాల గురించి వివరించారు. అనంతరం సంస్థ తరపున విద్యాపరంగా ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. దీనిలో భాగంగా గుండుగొలను హైస్కూల్‌లో ఆంగ్ల మాధ్యంలో చదువుతూ ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్న విద్యార్థులు బి.రాజేష్, ప్రీతి వర్ధినిలకు నగదు ప్రోత్సాహకాలు, ఇదేవిధంగా తెలుగు మాధ్యమంతో ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్న విద్యార్థులు ఎం.పద్మారాణి, వైలలితా దేవిలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఆగడాల లంక హైస్కూల్‌లో తెలుగు మాధ్యమంతో చదువుతూ ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్న విద్యార్థులు బి.ప్రశాంతి, ఎస్.ప్రహర్షలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వీరందరికీ సంస్థ తరపున పదవ తరగతి స్టడీ మెటీరియల్, నిఘంటువులు, మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేందుకు తాము ఎంచుకున్న మాధ్యమాలతో పనిలేదని, తమకు ఆసక్తిగల మాధ్యమాలను ఆసక్తిగా చదివి కృషి, పట్టుదలతో ఉన్నత స్థానాలకు చేరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, మండల శాఖ మాజీ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు, రెండు హైస్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు జికె.సునీత, ఎవివి.సత్యనారాయణ, అనంతలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎంఎల్‌ఎపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పోలవరం ఎంఎల్ఎ బాలరాజుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ కోరారు. గురువారం బుట్టాయగూడెం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. మార్చి నెలలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఉంచుకొని అన్ని విద్యాసంస్థల నుంచి విద్యార్థులు వచ్చి ఆటలాడాలి అంటూ చెప్తున్నారన్నారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో 10వ తరగతి పరీక్షా ఫలితాలు రెడ్ జోన్‌లో ఉన్నాయని, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాల్సింది పోయి బాధ్యతారహితంగా ఎంఎల్ఎగా ప్రవర్తిస్తున్నారన్నారు.

బుట్టాయగూడెం, పోలవరం మండల కేంద్రాల హాస్టల్లు, కాలేజీల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టాల్సిందిపోయి ఎన్నికల కోసం విద్యార్థులను, యువతను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈ ఆటలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేశారు. పరీక్షల కాలంలో ఇటువంటివి పెట్టడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని, తక్షణమే బుట్టాయగూడెం జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న బాలరాజు ట్రోఫీ సీజన్ 5 ఆటల పోటీలకు పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైసిపి అప్రజాస్వామిక వైఖరి విడనాడాలి

ఆశాల అరెస్టులను ఖండించిన సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

ఏలూరు అర్బన్: వైసిపి అప్రజాస్వామిక వైఖరి విడనాడకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలే గట్టి బుద్ధి చెబుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి హెచ్చరించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బుధవారం నుంచే జిల్లాలో పోలీసులు ఆశవర్కర్లతో పాటు సిఐటియు, సిపిఎం, ఇతర ప్రజాసంఘాల నాయకులకు నోటీసు ఇచ్చి నిర్బంధించారన్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచే ఇండ్ల వద్దకు వచ్చి దౌర్జన్యంగా అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్, కలిదిండి మండల కార్యదర్శి ఎస్.మహంకాళీరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఇతర నాయకులు బి.సోమయ్య, ఎ.శ్యామల రాణి, బి.జగన్నాధరావు, పి.గోపి, వేలేరుపాడు మండల సిఐటియు నాయకులు ఎం.దుర్గారావు, కుక్కునూరు సిఐటియు నాయకులు సాయి తదితర నాయకులను, ఆశ వర్కర్లను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారని తెలిపారు. ఆశ వర్కర్లతో, వారి నాయకులతో చర్చలు జరిపి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

నూజివీడు : ఆశా వర్కర్లను దూషించి, నూజివీడు మండల సిపిఎం కార్యదర్శి నర్సింహాపై దురుసుగా ప్రవర్తించిన నూజివీడు పట్టణ సిఐ వ్యవహారాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రవి తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని కాపాడాల్సిన, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన పోలీసులే ఆశా వర్కర్లపై, రాజకీయ నాయకులపై ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. నూజివీడు పట్టణంలోని సారధి ఇంజనీరింగ్ కాలేజీలో పోలీసులు నిర్బంధించిన వివిధ జిల్లాల ఆశా వర్కర్లను పరామర్శించడానికి వెళ్లిన సిపిఎం మండల కార్యదర్శి హనుమాన్లు, నూజివీడు మండల సిపిఎం కార్యదర్శి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులైన ఎన్.నర్సింహాపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ద్వారకాతిరుమల: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్స్‌పై జగన్ ప్రభుత్వం నిర్బంధాన్ని ఉపయోగించి ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని సిఐటియు ద్వారకాతిరుమల మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. మండలంలోని 20 మంది మహిళలను నిర్బంధించి వారికి కనీసం మంచినీళ్లు, టిఫిన్ కూడా ఇవ్వకుండా పోలీసులు దారుణంగా ప్రవర్తించారన్నారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు ఆదికృష్ణ, నాగలక్ష్మి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి విడనాడకుంటే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ధనలక్ష్మి పాల్గొన్నారు.

కుక్కునూరు : తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ మహాధర్నాకు వెళుతున్న ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆశాల ధర్నాకు వెళ్లనీయకుండా సిఐటియు మండల కార్యదర్శి సాయికిరణ్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. గురువారం ఆశావర్కర్లు, సిపిఎం, సిఐటియు నాయకుల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయం నుంచి సిపిఎం మండల కమిటీ ప్రకటన విడుదల చేసింది. ఆశాలకు అండగా ఉన్న సిఐటియు నాయకులు సాయికిరణ్‌ని ఈనెల 7వ తేదీ ఉదయం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు గృహ నిర్బంధంలో ఉంచి, 151 కేస్ ఫైల్ చేసి విడుదల చేశారన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు ఉన్నారు.

నేడు మారుమూడి విక్టర్ ప్రసాద్ పర్యటన

కైకలూరు : రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఈనెల 9వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 11.50కు కైకలూరు మండలం రాచపట్నం రానున్నారు. రాచపట్నం గ్రామంలో ఎస్‌సి కుటుంబానికి చెందిన భూమికి సంబంధించి ఆక్రమణపై విచారణ జరుపుతారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు రాచపట్నం నుంచి బయలుదేరి విజయవాడ వెళతారు.

12న మానిటరింగ్ కమిటీ సమావేశం

ఏలూరు : జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశం హాలులో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024వ సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యలు, కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు : ఏలూరు సెక్షన్ పరిధిలోని 33/11 కెవి శనివారపుపేట సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారపుపేట, 11 కెవి దుగ్గిరాల, 11 కెవి బైపాస్ శ్రీరామనగర్, విద్యానగర్ ఫీడర్‌లకు ఈనెల 9వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఏలూరు జెపిబి నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి

ఏలూరు : రహదారి కూడళ్లను దాటేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్ వై.సురేష్ బాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఏలూరులోని ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.మౌనిక పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గర్భిణుల నుంచి వృద్ధాప్యంలో ఉన్న అవ్వ తాతల వరకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. పోలవరం మండల కేంద్రంలోని స్థానిక మండల మహిళా సమైక్య ఐకెపి కార్యాలయం ఆవరణలో జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలలోని నాలుగో విడత ఆసరా కార్యక్రమం ఎపిఎం బెజవాడ శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైసిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. మండలంలో 942 స్వయం సహాయక సంఘాలకు రూ.7 కోట్ల 32 లక్షల 89 వేల 14 చెక్కును నియోజకవర్గ సమన్వయకర్త రాజ్యలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎంఎల్‌ఎగా నన్ను గెలిపించాలని, మా కుటుంబం ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటుందని రాజ్యలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపిపి సంఘాల అధ్యక్షులు ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, డ్వామా పీడీ కె.విజయ రాజు, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగాన్ని తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు, కౌలు రైతు సంఘాల ఏలూరు జిల్లా అధ్యక్షులు పుల్లూరు సోమశేఖర్ ఆచార్యులు, దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆయా సంఘాల పిలుపు మేరకు స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరు సోమ శేఖరాచార్యులు మాట్లాడుతూ నేడు రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. పెట్టుబడి వ్యయం పెరిగి మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో అమలు చేసే విధంగా రైతులకు రూ.15 వేలు తక్షణ సాయంగా అందించాలన్నారు. కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు దొంత కృష్ణ మాట్లాడుతూ అర్హత కలిగిన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మోడీ ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, ఆత్మహత్యలు నివారిస్తానని వాగ్దానం చేసి అధికారం చేపట్టిన తర్వాత రైతుల సంక్షేమాన్ని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు.

21 మంది విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒక కారుణ్య నియామకంతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 21 మంది విఆర్‌ఒలకు ఉద్యోగోన్నతులు ఇచ్చిన సందర్భంగా విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ గురువారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆకివీడు మండలంలో పనిచేస్తూ గుండెపోటుతో కడిమి కిరణ్ తండ్రి మరణించడంతో కిరణ్‌కు కారుణ్య నియామకం కింద జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. అలాగే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న 21 మంది విఆర్‌ఒలకు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు శ్రీరామచంద్రమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తర్వులు ఇస్తున్న కలెక్టర్

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

బుట్టాయగూడెం : జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టకముందు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 50 వేల పోస్టులన్నిటిని భర్తీ చేస్తానని హామీ ఇచ్చి నేడు ఎన్నికల దగ్గర పడుతున్న సమయంలో కేవలం 6,100 ఉపాధ్యాయ పోస్టులకి నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని పివైఎల్ జంగారెడ్డిగూడెం డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబూరావు విమర్శించారు. మండలంలోని పిఆర్ భవన్‌లో పిడిఎస్‌యు, పివైఎల్ సంఘాల ఆధ్వర్యాన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివైఎల్ జంగారెడ్డిగూడెం డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబురావు మాట్లాడుతూ ఉపాధ్యాయ పోస్టుల కోసం లక్షలాది మంది నిరుద్యోగులు లక్షలాది రూపాయలతో కోచింగ్ సెంటర్లలో ట్రైనింగ్ తీసుకుంటుంటే అతి తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులను నిలువునా మోసం చేయడమే అన్నారు. ఇది మెగా డిఎస్‌యు కాదు, మినీ డిఎస్‌సి అని దుయ్యబెట్టారు. అనంతరం పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు నేను ఉన్నాను.. నేను విన్నాను.. అంటూ నిరుద్యోగులను మభ్యపెట్టి అధికారం చేపట్టి అన్యాయం చేశారన్నారు. మెగా డిఎస్‌సిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పివైఎల్, పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ అంశాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ రహదారుల పెండింగ్ అంశాలు రెవెన్యూ, అటవీ తదితర సంబంధిత శాఖలు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి సూచించారు. నేషనల్ హైవే పెండింగ్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గురువారం మధ్యాహ్నం విజయవాడ నుంచి సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేయగా జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఫ్రూట్ స్టాల్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం నూజివీడు ప్రాంగణంలో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యాన కె-3 గర్ల్స్ హాస్టల్‌లో డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థుల సౌకర్యార్థం ఫ్రూట్ స్టాల్‌ను గురువారం ప్రారంభించారు. వికలాంగులైన విద్యార్థుల కోసం వాషింగ్ మిషన్ కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య చంద్రశేఖర్ మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆ సంస్థ డైరెక్టర్‌ను అభినందించారు.

దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, నడుపల్లె గ్రామం ఇంటి నెంబర్ 1-7/3 రు కాపురస్తులు కాట్రు రాములు గారి కుమారుడు కాట్రు బసవయ్య తెలియచేయునది ఏమనగా,

ది. 07-08-2018న నా స్వార్జిత సొమ్ముతో దుగ్గిరాల గ్రామము నందు ఆర్.యస్. నెంబర్ 340 రు దాఖలా 105 చదరపు గజములు కొనుగోలు చేసి ఏలూరు రిజిస్టర్ కార్యాలయం నందు దస్తావేజు నెంబర్ 9023/2018 రుగా రిజిస్టర్ కాబడినది. సదరు పైన ఉదహరించిన ఒరిజినల్ దస్తావేజును ఫొటోస్టాట్ కాపీలు నిమిత్తం ఏలూరు 1 టౌన్ ఏరియా రామకోటి సెంటర్ ఏరియా నందు నా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్నాను. ఆ సమయంలో ఎంత వెతికినా దొరకపోవటం ఈ పేపర్ ప్రకటన వేయుచున్నాను. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు 9023/2018 ఏలూరు (R.O), ఎవరికయినా దొరికినచో పై తెలిపిన అడ్రసుకు అందించగలరు.

సెల్: 7386677379

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు అయిన ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండలం, పొంగుటూరు గ్రామ కాపురస్తులు **వీరభద్రుడు గారి కుమారుడు పసుపులేటి రాంబాబు గారు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ది. 07-02-2024న మా క్లయింటు స్థిరాస్తి తాలూకు ఒరిజినల మరియు లింకు దస్తావేజులు తీసుకుని జిరాక్సు నిమిత్తం పొంగుటూరులో గల తన నివాసం నుండి కొయ్యలగూడెం సెంటర్‌కు వెళుతుండగా దారిలో **ది. 25-06-2015 సం॥రం తేదీన** పట్టపు శ్రీహరి అను వారి వద్ద నుండి నా క్లయింటు క్రయం పొంది అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన **దస్తావేజు నెం. 2189/2015** మరియు దాని తాలూకు **లింకు దస్తావేజులు 1174/2004, 1084/2007 మరియు 755/2011** లు పోయినవి. కావున సదరు పై దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల దయచేసి ఈ దిగువ అడ్రస్ నందు తెలియజేయవలసినదిగా కోరడమైనది.

వీర్ల సతీష్‌కుమార్, అడ్వకేట్
నిడదవోలు, తూ॥గో॥జిల్లా
సెల్: 99891 79905

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో, కదిరి

H.M.O.P No. 145/2022

Between:

ఒడం కిరణ్మయ్ W/o అక్కిరెడ్డి దిలిప్, D.No:1-1135-250, అడపాల వీధి, కదిరి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్

మరియు

అక్కిరెడ్డి దిలిప్ S/o ఎ.శ్రీనివాసులు, D.No:15-123, అగ్రహారం వీధి, ఆకువీడు గ్రామము మరియు మండలం వెస్టు గోదావరి జిల్లా. ...రెస్పాండెంట్

ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 12/02/2024 తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 12/02/2024 వ తేది ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పరోక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:12/02/2024
స్థలం:కదిరి

పి.వి.శివప్రసాద్, B.Com., B.L,
వాదితరుపు వకీలు, కదిరి.

SOUTH INDIAN Bank

జె.పి. రోడ్, భీమవరం బ్రాంచ్ 08816-231678

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది బంగారు ఆభరణములపై ఋణములు పొంది తిరిగి సకాలములో చెల్లించనందున ఈ క్రింది తెలియపరచిన బంగారు ఆభరణములను సౌత్ ఇండియన్ బ్యాంక్, భీమవరం బ్రాంచి నందు ది. 17-2-2024 శనివారం మధ్యాహ్నం 3 గం.లకు వేలం వేయుటకు నిర్ణయించడమైనది.

క్ర సం.	ఖాతా నెంబర్	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	బంగారం గ్రాలలో	బకాయి
1.	098965300 0002544	యిందుకూరి శివ కృష్ణంరాజు, డోర్ నెం.1-45, శివాలయం వీధి, వసంతవాడ-533 235, తూ॥గో॥జిల్లా.	8.8	రూ.25,000/-

షరతులు - నిబంధనలు : 1) వేలం నందు పాల్గొనదలచినవారు రూ.3,000/- ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. అట్లు చెల్లించని ఎడల పాటదారులు తమ యొక్క ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. 3) నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకువారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ, బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 5) ఈ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 6) అప్పు వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలము తేదీలోగా సొమ్ము చెల్లించవచ్చును.

తేది : 8-2-2024 సం/- బ్రాంచ్ మేనేజర్, భీమవరం

TADEPALLIGUDEM MUNICIPALITY

E-PROCUREMENT TENDER NOTICE

Roc. No. 2422/E1/2023-24 Dated: 09-02-2024

Sl. No.	Name of Work	Name of the Grant	Estimate Value (Rs. in Lakhs)	Bid Downloading start date	Last Date for Receipt of Bids
1	Civil, Water Supply & Electrical works - 04 Nos	General Funds	21.35	09-02-2024	15-02-2024

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in

Sd/- COMMISSIONER
TADEPALLIGUDEM MUNICIPALITY